డంపింగ్ యార్డుల్లా రోడ్లు

- వ్యర్థాలను పడేస్తున్న ప్రైవేట్ వ్యక్తులు
- వెదజల్లుతున్న దుర్వాసన
- చుప్‌చాప్ గల్లీలో రాకపోకల బంద్
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అధికారులు
- ఆజామాబాద్‌లో దుస్థితి ఇదీ..


రోడ్డుపై పడేసిన వ్యర్థాలు

రాంనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆజామాబాద్‌లోని ప్రధాన రోడ్లు డంపింగ్ యార్డుల్లా తయారవుతున్నాయి. బస్ భవన్ నుంచి వీఎస్టీకి వచ్చే చుప్‌చాప్ గల్లీ రోడ్డులో కొంత కాలంగా ప్రైవేట్ వ్యక్తులు రోజూ రాత్రి ట్రాక్టర్ల ద్వారా ఇంటి వ్యర్థాలను తీసుకు వచ్చి పడేస్తున్నారు. దీంతో లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్డు డంపింగ్ యార్డుగా మారుతోంది. ఆ వ్యర్థాల వచ్చే దుర్వాసనలతో సమీపంలోని బస్‌భవన్‌లో పనిచేసే ఉద్యోగులు, వీఎస్టీ కార్మికులతోపాటు స్థానిక ప్రజలు, వాహనదారులు, పాదచారులు దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో స్వచ్ఛభారత్ నిర్వహించి ఆజామాబాద్‌లోని రోడ్ల పక్కన చెత్త, మట్టికుప్పలను తొలగించి వాహనాల రాకపోకలు కొనసాగించారు. కొంతకాలంగా శానిటేషన్ అధికారులు ఈ రోడ్లపై పోస్తున్న మట్టి డంపింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రాత్రి వేళలో చుట్టుపక్కల ప్రాంతాలలో ఇళ్లు కూల్చినవారు, ఇతరులు వ్యర్థాలను ఈ ప్రాంతాల్లోనే పడేస్తున్నారు. ఈ విషయం జీహెచ్‌ఎంసీ శానిటేషన్ ఎస్‌ఎఫ్‌ఏ ఇతర సిబ్బందికి తెలిసినా తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఆజామాబాద్‌లో అక్రమ మట్టి వ్యర్థాల డంపింగ్‌ను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎన్నో సార్లు ఫిర్యాదు చేశాం



ఆజామాబాద్‌లో అక్రమంగా పోస్తున్న మట్టి వ్యర్థాల డంపింగ్‌ను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ సర్కిల్ ఏఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశాం. కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రైవేట్ వ్యక్తులు వచ్చి వీటిని పోస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలోని రోడ్లు మట్టి వ్యర్థాలతో నిలిచిపోయాయి. గతంలో ఆర్టీసీక్రాస్ రోడ్స్ నుంచి రాంనగర్, విద్యానగర్‌కు వెళ్లే ప్రజలు ఆర్టీసీ బస్‌భవన్ పక్క నుంచి ఈ మార్గంలో వెళ్లేవారు. దీంతో వీఎస్టీ మెయిన్ రోడ్‌లో ట్రాఫిక్‌కు జామ్ అయ్యేది కాదు.

\- కె.రవిచారి, రాంనగర్ కార్పొరేటర్

దుర్వాసనతో అనారోగ్యం

ఆజామాబాద్ పారిశ్రామిక ప్రాంతంలోని రోడ్లన్నీ చెత్త, మట్టిలతో నిండిపోవడం వల్ల కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారు. వీఎస్టీ లేబర్ గేట్ ఎదురుగా ఉన్న రోడ్డు మట్టి వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో స్థానిక కార్మికులు ఇంటి నుంచి కంపెనీకి వెళ్లే సమయంలో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

\- కె.రాజు, వీఎస్టీ కార్మిక నాయకుడు

బీసీ గర్జనకు తరలివెళ్లిన వీహెచ్


గర్జనకు తరలివెళ్తున్న హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు

రాంనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన బీసీల గర్జనలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు బుధవారం పాల్గొన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో, విద్య, ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీరాం భద్రయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి బోర్డు మాజీ చైర్మన్ జి.నాగభూషణం, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

వడ్డెర సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో...



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మంత్రి సురేఖ, అంతయ్య

చిక్కడపల్లి: ఢిల్లీలో నిర్వహించిన బీసీల పోరుగర్జనలో వడ్డెర సంఘం తెలంగాణ (గన్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య వడ్డెర సంఘం లక్ష్యసాధన రాష్ట్ర అధ్యక్షుడు జరిపేటి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖను కలిశారు. స్థానిక ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం ముఖ్య సలహాదారు డా. ఓర్సు కృష్ణయ్య, నగర అధ్యక్షుడు మక్కాజి వెంటేష్, పల్లపు లక్ష్మీనారాయణ, శివరాత్రి అంజయ్య, పల్లపు గణేష్, అనంతరావు, మోహన్‌కుమార్,శాంతికుమార్, వెంకటకృష్ణ, బాలరాజు, బాలకృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల నెలగా ఏప్రిల్‌ను పరిగణించాలి

- కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

రాంనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా భావించాలని కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్ర, సాంకేతికరంగం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ నేటికీ కులవివక్ష కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కుల వివక్ష, అంటరానితనాన్ని నిషేధిస్తూ రాజ్యాంగంలో పలు ఆర్టికల్స్ స్పష్టంగా పేర్కొన్నాయని తెలిపారు. రాజ్యాంగాన్ని అమలు చేసే పాలకులు ఈ అమానుష వివక్షను అరికట్టడంలో విఫలమయ్యారని ఆరోపించారు. దీంతో దేశవ్యాప్తంగా, రాష్ట్రంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, హత్యలు, గ్యాంగ్ రేప్‌లు, సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయన్నారు. పండుగలలో కూడా వివక్షత పాటిస్తున్నారన్నారు. నేటికీ కొన్ని గ్రామాలలో రెండు గ్లాసుల విధానం, ఆలయంలోకి రానీవ్వకపోవడం శోచనీయమన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 10వ తేదీ వరకు గ్రామగ్రామాన కులవివక్షపై అధ్యయనం, ఈనెల 11 జ్యోతిరావుపూలే జయంతి, ఈ నెల 14 డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జయంతి వరకు పూలే-అంబేడ్కర్ జనజాతర సభలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 15 నుంచి 31 వరకు కుల వివక్షపై గ్రామాలలో ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఎం.దశరథ్, సుబ్బారావు, కృపాసాగర్, జి.లక్ష్మణ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


పోలీసుల అదుపులో శిల్పారెడ్డి, నవీన్ గౌడ్, కంచి ముదిరాజ్

స్థలాల విక్రయ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ముషీరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం అమ్మేందుకు ప్రయత్నిస్తున్నదని, వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హెచ్‌సీయూ స్థలాల పరిరక్షణ కోసం బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు శిల్పారెడ్డి చేపట్టిన నిరసనను అడ్డుకొని అరెస్టు చేసి ముషీరాబాద్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీజేపీ నాయకులు ఆమెను కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా సర్కారు స్పందించి ప్రభుత్వ స్థలం విక్రయాన్ని నిలిపివేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, బీజేవైఎం అధ్యక్షుడు ఆయూష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాసు, మహిళా కమిటీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.


గెలుపు గుర్తును చూపుతున్న సంజీవరెడ్డి ప్యానల్ సభ్యులు

ఐఎన్‌టీయూసీ ఘన విజయం

వీఎస్‌టీ ఎంప్లాయీస్ కోపరేటివ్ కన్స్యూమర్ సొసైటీ ఎన్నికల ఫలితాలు

రాంనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ కన్స్యూమర్ సొసైటీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి ప్యానల్ ఘనవిజయం సాధించింది. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ యూనియన్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు ఎన్నికలు జరిగాయి. సొసైటీలో 186 మంది మంది ఓటర్లు ఉండగా పోలింగ్‌లో 173 మంది పాల్గొన్నట్లు ఎన్నికల అధికారి శివకుమార్ తెలిపారు. ఈ ఎన్నికల్లో పది మంది డైరెక్టర్ల పదవుల కోసం 24 మంది పోటీ పడినట్లు తెలిపారు. ఇందులో 9 మంది జనరల్ కోటా డైరెక్టర్‌ల కోసం 21 మంది, ఎస్సీ డైరెకర్ కోసం ముగ్గురు పోటీపడినట్లు చెప్పారు. ఈ పోటీలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి ప్యానల్, నాయిని నర్సింహారెడ్డి ప్యానల్, బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్యానెల్‌లు పోటీపడ్డాయి. సంజీవరెడ్డి సభ్యులు ఏకపక్షంగా పది మంది గెలిచారు.

5 నుంచి సీతారాముల కల్యాణం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సుధాకర్‌గుప్తా తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 7 వరకు శ్రీసీతారాముల కల్యాణం, రథోత్సవ వేడుకలను రాంనగర్‌లోని సెయింట్ ఫాయిస్ స్కూల్ మెయిన్ రోడ్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు వి.సుధాకర్‌గుప్తా తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించి రూపొందించిన ఆహ్వాన బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం రాంనగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో 24 సంవత్సరాలు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సారి రజతోత్సవం సందర్భంగా కల్యాణ మహోత్సవాన్ని మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

- ముగిసిన టెన్త్ పరీక్షలు

ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 21 నుంచి ప్రారంభమైన పరీక్షలు బుధవారంతో పూర్తయ్యాయి. మండల పరిధిలో 4,807 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

ముషీరాబాద్, (ఆంధ్రజ్యోతి)



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో పరీక్షలు రాసి సంతోషంతో బయటకు వస్తున్న విద్యార్థినులు, విజయ సంకేతం గుర్తు చూపుతూ...(ఇన్‌సెట్‌లో)

సీజ్ చేసిన కార్యాలయం నడుపుతున్నారు..

- కమలాకరశర్మపై చర్యలు తీసుకోవాలి
- ధన్వంతరి బాధితుల ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ


మాట్లాడుతున్న గిరిప్రసాద్‌శర్మ

నల్లకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేటలోని ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ కార్యాలయంను సీసీఎస్ సీజ్ చేసినప్పటికీ సదరు కమలాకరశర్మ నడిపించడం ఎంతవరకు సమంజసమని ధన్వంతరి బాధితుల ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ ప్రశ్నించారు. జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన అతను తిరిగి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శర్మ మాట్లాడారు. ధన్వంతరి ట్రస్ట్ ద్వారా అధిక వడ్డీలు ఆశచూపి 3 వేల మంది నుంచి పెట్టుబడులు సేకరించి మోసం చేసిన ఈ విషయంపై అతడిని ప్రశ్నిస్తే కోర్టులో చూసుకోండి అంటూ పెట్టుబడిదారులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారన్నారు. తన అకౌంట్లలో ఉన్న డబ్బులు డ్రా చేసుకుంటున్నాడని ఆరోపించారు. ఈ కేసు నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు.. కమలాకరశర్మపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి తాము కమలాకరశర్మకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ప్లానింగ్‌తో చదవాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒకే లక్ష్యం దిశగా స్థిరంగా హార్డ్‌వర్క్ చేసేవారు ఎంతటి ఉన్నత లక్ష్యాన్ని అయినా సాధించగలరు అని ఆర్‌సీరెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఆర్‌సీ రెడ్డి అన్నారు. తెలంగాణ గ్రూప్ 1 ఫలితాల విడుదల నేపథ్యంలో విజేతలతో ముఖాముఖి కార్యక్రమం బుధవారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని తన ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో జరిగింది. సిలబస్‌ను అనుసరించి కచ్చితమైన ప్లానింగ్‌తో చదవడం ముఖ్యమన్నారు. స్టడీ సర్కిల్ నుంచి తెలంగాణ గ్రూప్ 1 టాపర్‌లుగా నిలిచిన పలువురిని అభినందించారు.

దమ్ముంటే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ నగర పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదంపై ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో నిర్వహించిన బీసీల పోరుగర్జనలో పాల్గొన్నారని ఆరోపించారు. యూనివర్సిటీ భూములను ప్రభుత్వం లాక్కోవడం సరికాదన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై కఠిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ప్రకాష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్యులు

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ముషీరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి అన్నారు. బుధవారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో 5 సంవత్సరాలలోపు చిన్నారులకు 12 ప్రాణాత్మక వ్యాధుల నుంచి రక్షించే టీకాలను వేశారు. వారిని వ్యాధుల నుంచి రక్షించేందుకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి పీహెచ్‌ఎన్ ఫెల్లిస్, ఏఎన్‌ఎం విజయకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల పట్ల కఠిన వైఖరి తగదు

రాంనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వ పక్షపాత వైఖరి తగదని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రాజేంద్రబాబు, ఎం.వి.నర్సింగ్‌రావులు పేర్కొన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జనవరి లో ఇవ్వాల్సిన ఒక విడత కరువు భత్యం ఆలస్యంగా అయినా ప్రకటించింది కదా అని సంతోషించేలా? లేదా రాష్ట్ర పెన్షనర్లకు నూతన వేతన సవరణ సిఫారసులు వర్తించవని చెప్పడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సంఘం తరపున ఖండించిందన్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వి.రామ్మోమనోహర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

20న సామూహిక ఉపనయనాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అఖిల బ్రాహ్మణ సమాజ అభివృద్ధి సంస్థ(ఏబీసీడీఓ) చిక్కడపల్లి వారి ఆధ్వర్యంలో ఈనెల 20న బ్రాహ్మణ 41వ ఉచిత సామూహిక ఉపనయనాలు నిర్వహిస్తున్నారు. కీసరలోని అన్నపూర్ణ బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రంలో ఆరోజు ఉదయం నుంచి కార్యక్రమం జరుగుతుందని ఏబీసీడీఓ ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం వివరించారు. కీసరగుట్ట అన్నపూర్ణ బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రంవారి సౌజన్యంతో జరిగే కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు ఈనెల 10లోపు 93906-46539, 94928-77204, 91004-14469 నంబర్‌లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

జీవవైవిధ్య పరిరక్షణకు ప్రజాఉద్యమం

- హెచ్‌సీయూ భూములు యథాతథంగా కొనసాగించాలి
- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విమలక్క, భద్ర, విజయ్ తదితరులు

నల్లకుంట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను యథాతథంగా కొనసాగించాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 15 రోజులుగా భూముల వేలం జరుగుతున్న పోరు.. విద్యా వాతావరణాన్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై లాఠీచార్జి, అక్రమ కేసులను ఎత్తివేయడంతో పాటు హెచ్ సీయూలో ఉన్న పోలీసులను వెనక్కి రప్పించాలన్నారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షుడు సీ.హెచ్.భద్ర, పీడీఎస్‌యు (విజృంభణ) నాయకుడు విజయ్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. హెచ్‌సీయూలోని వందల ఎకరాలలో జంతు, జీవజాలానికి నిలయమైందని, దీంతో ప్రభుత్వం బేషజాలకు పోకుండా 400 ఎకరాల భూమిని విద్యేతర వ్యాపార ప్రయోజనాలకు కేటాయించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకృతి విధ్వంసం జరుగుతున్న నేపథ్యంలో హెచ్‌సీయూలో జీవవైవిధ్యం రక్షించుకోవడానికి పెద్దఎత్తున ప్రజాఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తొలుత జీవవైవిధ్య సంరక్షణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. రమేష్, రాకేష్, ఉపేందర్, సురేష్ పాల్గొన్నారు.

శోభాయాత్రకు తరలిరండి


మాట్లాడుతున్న శ్రీరామశోభాయాత్ర కన్వీనర్ డాక్టర్ గౌతమ్‌రావు

బర్కత్‌పుర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీసీతారాముల కల్యాణం సందర్భంగా ఈనెల 6న అంబర్‌పేట నియోజకవర్గంలో నిర్వహిస్తున్న శ్రీరామశోభాయాత్రకు భారీగా భక్తులు తరలిరావాలని శ్రీరామశోభాయాత్ర కన్వీనర్ డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసి హిందువుల ఐక్యతను చాటిచెప్పాలన్నారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో శ్రీరామశోభాయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా.ఎన్.గౌతమ్‌రావు మాట్లాడారు. ఈ నెల 6న సాయంత్రం 3 గంటలకు అంబర్‌పేట మున్సిపల్‌గ్రౌండ్ నుంచి యాత్ర ప్రారంభమై ఛేనంబర్ చౌరస్తా, తిలక్‌నగర్ చౌరస్తా, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, బర్కత్‌పుర చమాన్, కాచిగూడ టూరిస్ట్ హోటల్, వీరసావర్కర్ విగ్రహం చౌరస్తా మీదుగా సుల్తాన్‌బజార్‌లోని శ్రీహనుమాన్ వ్యాయామ శాల వరకు జరుగుతోందన్నారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఆయన సతీమణి కావ్యకిషన్‌రెడ్డి, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి మల్లికార్జున్, కార్పొరేటర్ వై.అమృత, బీజేపీ నాయకులు కన్నె రమేష్‌యాదవ్, నందకిషోర్‌యాదవ్, ఎక్కాల నందు, ఎడెల్లి అజయ్‌కుమార్, వనం రమేష్, బుచ్చిరెడ్డి, శ్యామ్‌రాజ్, సి.కృష్ణగౌడ్, ఎక్కాల కన్నా, క్షీరసాగర్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

యాసిడ్ తాగి వృద్ధుడి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మానసికస్థితి సరిగ్గా లేని ఓ వృద్ధుడు యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాచిగూడ పీఎస్ ఎస్‌ఐ నరేషకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్న షేక్ బడేసాహెబ్ కుమారుడు షేక్ ఫక్రుద్దీన్ (80) మానసికస్థితి సరిగ్గా లేదు. మంగళవారం సాయంత్రం బాత్రూమ్ క్లీనింగ్ చేసే యాసిడ్ తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం తెల్లవారుజాము చికిత్స పొందుతూ మృతిచెందాడు. బంధువు మహ్మద్ షమీవుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా శ్రీలక్ష్మీదేవి హోమం

చిక్కడపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణ తృతీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం శ్రీలక్ష్మీదేవి హోమం నిర్వహించారు. అమ్మవారి జయంతి సందర్భంగా కార్యక్రమం జరిగింది. ఉదయం గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ, ప్రదోషకాల పూజా కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్దఎత్తున చేరుకుని పూజల్లో నిర్వహించారు. ఆలయ ఈవో దేవనాథం, ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాగిజావ పంపిణీ కేంద్రం ప్రారంభం


రాగిజావ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వేణుగోపాల్

చిక్కడపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉచిత రాగిజావ పంపిణీ కేంద్రం బుధవారం అశోక్‌నగర్‌లో ప్రారంభించారు. శ్రీ సత్యసాయి సేవాసంస్థలు హిమాయత్‌నగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా.. 100 రోజులపాటు రోజుకు వెయ్యి గ్లాసుల రాగిజావ అందజేస్తారు. ప్రముఖ సంఘసేవకులు టి. వేణుగోపాల్ లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం కన్వీనర్ రామకృష్ణ, సభ్యులు మధుసూదన్, నాగరాజు, పాండురంగారావు, మల్లీశ్వరి, కౌముది, సత్యభామ, రాధ తదితరులు పాల్గొన్నారు.

కూలిన రెయిలింగ్ ఘటనలో బాధితులకు పరామర్శ

గోల్నాక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సంజయ్‌గాంధీనగర్‌లో పురాతన భవనం రెండో అంతస్తులోని రెయిలింగ్ ప్రమాదవశాత్తుగా కూలింది. దీంతో ముగ్గురు క్షతగాత్రులయ్యారు. ఈ విషయం తెలుసుకుని వెంటనే హిమాయత్‌నగర్ మండల తహసీల్దార్ సంధ్యారాణి సంజయ్‌గాంధీనగర్‌కు చేరుకుని సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. భవనం పురాతనమైంది కాబట్టి ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి కొత్త భవన నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటానని స్థానికులకు ఆమె చెప్పారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ సీనియర్ నాయకుడు కన్నె రమేష్‌యాదవ్, కాంగ్రెస్ నాయకుడు ఫరీద్ తదితరులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఈ విషయంలో అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చెయ్యి ఫ్యాక్చర్ అయిన సంజయ్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ప్రస్తుతం ఎవరికి ఎలాంటి ప్రమాదం మాత్రం లేదు. ప్రభుత్వం పురాతన భవనంపై తక్షణమే చర్యలు తీసుకోకుంటే భవిష్యత్‌లో మరిన్ని ప్రమాదాలు జరగనున్నాయని అనడంలో ఎలాంటి సందేహం లేదు.



ఘటనా స్థలంలో తహసీల్దార్ సంధ్యారాణి, క్షతగాత్రుడు సంజయ్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్, బీజేపీ నేతలు (ఇన్‌సెట్‌లో)